
"ఒరేయ్ !" -

**ఈ మాట ఎంత ఆత్మీయమైనది ! ఎంత దగ్గరితనం, ఎంత సమానత్వం ఉన్నాయి ఆ పదంలో. ఓ రకంగా అందులో ప్రేమ కూడా ఇమిడి ఉంది. 'ఒరేయ్, ఒరేయ్' అని పిలుచుకొనేవాళ్లు నిజంగా ఎంతో అదృష్టవంతులు.**

# ఒరేయ్

బాలం వెంకటరావు



నాగరికత పెరిగి వేష భాషలు మారి విజ్ఞానం అమితంగా అభివృద్ధి చెంది మనుమల్లో - మనసుల్లో ఆత్మీయత, ప్రేమ తరిగిపోతున్నాయి. లేనిపోని భేషజాలు, పొరుగింటి పుల్ల కూర ఆధునికతలో పడి సహజ గుణాల్ని సమాధి చేసేస్తున్నారు. నిజంగా వీళ్లలో తనూ ఒకడే ! - చల్లగాలి ఆహ్లాదంగా ఉంటే గుట్ట మీద కూర్చున్న రాజారావుగారిలో కలిగిన భావాలు ఇవి.

దగ్గరలోని చెరువులో పశ్చిమాద్రి సూర్యుడు స్నానమాడుతున్నట్లుంది. ఆకాశం కడిగిన అద్దంలా నిర్మలంగా ఉంది. దూరంగా బస్సులు, టాక్సీలు, రైళ్ల రణగొణ ధ్వనులు, ఫ్యాక్టరీ సైరన్‌లు నగరపు ఉనికిని తెలియజేస్తున్నాయి. రాజారావుగారి ఆలోచనలు నగరం వైపు మళ్లాయి

"నగరం 'నా' అనొద్దంటుంది. నవ నాగరికత నిత్యం నవనవలాడుతూ దర్పన మిస్తుంది అభివృద్ధి చెందుతూ. రోడ్డు మీద 'సార్', ఆఫీసుల్లో 'సార్'. ఆఖరికి ఇళ్ల వద్ద కూడా సార్ ! అబ్బ ! ఈ సార్ మనుమల్ని ఎంత దూరం చేసేస్తుంది. 'ఒరేయ్ !' అని ఒక్కడు కూడా అనడు. సరదాగా, ఆత్మీయంగా 'ఒరేయ్' అని పిలిస్తే సొమ్మేం పోతుంది ? ప్చ్ ! తను 'ఒరేయ్ !' అని పిలిపించుకొనీ, 'ఒరేయ్' అని ఎంతో కాలమైంది ! ఎలాగైనాసరే 'ఒరేయ్ ! అనే వాణ్ణి సంపాదించుకోవాలి" అనుకున్నారు రాజారావుగారు. చీకటి పడడంతో ఇంటికేసి నడవసాగారు.

దారిలో స్నేహితుడు భూపతి ఎదురయ్యాడు ! రాజారావుగార్ని చూడడంతోనే నవ్వుతూ "హల్లో. రాజారావు గారూ !" అన్నాడు.

"హల్లో..." అన్నారు రాజారావుగారు అప్రయత్నంగా.

అతను అలాగే వెళ్లిపోయాడు. ఈయన ఇలాగే ముందుకు నడిచారు.

"వీడూ అంతే. నవ్వు మొహం పెట్టాడుగాని అది తగిలించుకున్నది. అసలు రూపం వేరు. నన్ను ముట్టుకోకు అన్నట్టుగా "గారు" - గొణుక్కున్నారు.

ఇంటికి వచ్చేటప్పటికి భార్య రుక్మిణమ్మ వరండాలో ఎదురు చూస్తోంది. అది లంకంత కొంప కాకపోయినా కొంచెం పెద్ద బంగళా. వారికి పిల్లలు లేని కారణంగా ఆ ఇల్లు సాధారణంగా నిశ్శబ్దంగానే ఉంటుంది. ఆయన బయటికెళ్తే అశోక వనంలో సీతలా ఆమె ఒక్కర్తే ! చుట్టు పక్కల వాళ్లూ ఉన్నారుగాని అందరూ ఆఫీసర్లూ, ఉన్నతోద్యోగులూ అవడం వలన ఒకరికొకరికి సంబంధం ఉండదు. ఒకవేళ ఉన్నా చాలా హుందాగా, హోదాగా ఉంటుంది.

"మీరు ఎప్పుడొస్తారా అని చూస్తున్నాను. అన్నం చల్లారిపోతుంది" అంది రుక్మిణమ్మ భర్తతో.

రాజారావుగారు గతుక్కుమన్నారు.

'అదిగో మళ్లీ 'మీరు !' ఇంట్లో కూడా తప్పలేదురా భగవాన్' అనుకున్నారు రాజారావుగారు.

ఆయన వాలకం చూసి "ఏమిటీ !" అంది రుక్మిణమ్మ. రాజారావుగారు తేరుకుని "ఆ ! ఏమీ లేదు... పద భోజనం పెట్టు" అన్నారు.

ఇద్దరూ డైనింగ్ హాల్లోకి నడిచారు.


భోజనాల దగ్గర రోజూ కబుర్లు చెప్పే రాజారావుగారు ఆ పూట చాలా నిశ్శబ్దంగా భోజనం మిగించారు. భర్త పరిస్థితి ఆమె కేమీ బోధపడలేదు.

* * *

ఆ మర్నాడు మామూలుగానే ఆఫీసుకెళ్లారు రాజారావుగారు. కుర్చీలో కూర్చుని ఫైళ్లు తిరగేస్తున్నారు. మనసేమో బాగాలేదు. అటెండర్ యాదగిరిని పిలిచి కాఫీ తెమ్మన్నారు. అయిదు నిమిషాల్లో కాఫీ వచ్చింది. వేడి వేడి కాఫీ తాగి సిగరెట్టు ముట్టించారు. తర్వాత ముఖ్యమైన ఫైళ్ల మీద వరసగా సంతకాలు పెట్టడం ప్రారంభించారు.

"యాదగిరీ ! జూనియర్ అసిస్టెంట్ గోవిందరావుని పిలు" అని అటెండరుని ఆదేశించారు.

"అట్లాగే సార్ !" అంటూ సెక్షన్‌లోకి వెళ్లాడు.




...గోవిందరావు వచ్చాడు. విధేయుడై నిలబడ్డాడు.

"ఫైళ్లు ఇంత లేటెందుకయింది?" సీరియస్‌గా అడిగారు రాజారావుగారు.

"లేదు సార్! మూడు రోజుల క్రితం కరెంట్ వచ్చింది. ఫైలు మొన్ననే పుటప్ చేశాను... మీరు ఆఫీసుకు రాలేదు." నమ్రతగా అన్నాడు.

నాలిక్కరుచుకోలేదు, గతుక్కుమనలేదు రాజారావుగారు. అతని 'సిన్సియారిటీ' ని తప్పు పట్టినందుకు 'సార్' ప్రయోగించకుండా అతనిలో, కొంచెం రఫ్‌గా మాట్లాడే ధోరణి కనిపిస్తుందేమో అనుకున్నాడు తను. కాని, అలా జరగలేదు.

"సారీ!, మిస్టర్ గోవిందరావ్! మీరు వెళ్లండి" అని ఊరుకున్నారు. కొన్ని ఫైళ్లు అటు ఇటు తిరగేశారు. పని చేయబుద్ధవలేదు. ఆ రోజు అలా గడిచిపోయింది.

రోజులు దొర్లుతున్నాయి.

ఇటీవల రాజారావుగారి ప్రవర్తనలో ఒక విధమైన మార్పు కనిపిస్తోంది. తను ఆఫీసరు అన్న సంగతి మరిచిపోయి సిబ్బందితో స్నేహంగా మసలుతూ వాళ్లకి దగ్గరవాలని ఆయన ఉద్దేశం. ఎప్పుడూ సీరియస్‌గా, సుపీరియారిటీతో అదో తరహాగా ఉండే అయనలో ఇప్పుడొచ్చిన మార్పుకు ఆశ్చర్యపోతున్నారు. చూసే వారికి కూడా అది కొంచెం వింతగానే అగుపించసాగింది. ఆయన మనసులో మాత్రం ఒకటే ఆలోచన. ఒకటే తహ తహ. అది - 'ఒరేయ్' అని సంబోధించాలనీ, 'ఒరేయ్' అని పిలిపించుకోవాలనీ.

మామూలుగా ఆ రోజున కూడా ఆఫీసులో పని చేసుకొంటున్నారు రాజారావుగారు. ఉన్నట్టుండి ఆయన దృష్టి గుమ్మం దగ్గర స్టూలు మీద కూర్చుని ఉన్న అటెండరు మీద పడింది.

"ఒరేయ్! యాదగిరీ!" - కేకేశారు.

రివ్వున తల తిప్పి చూశాడు యాదగిరి.

"నిన్నేరా!... కాఫీ తీసుకురా" అన్నారు రాజారావుగారు.

ఆ పిలుపులో అర్హత ఉంది. ప్రేమ ఉంది. అదో రకమైన అనుభూతి కూడా కలిగింది ఆయనకి.

ఆ మాటలకు "ఆc..." అంటూ చివాలున లోపలికొచ్చాడు, యాదగిరి.

"మీరు... మీరు... నన్ను 'ఏరా' అంటారా?... మీరు ఆఫీసరైనంత మాత్రాన... ఏరా, ఒరేయ్! అంటే ఎవరు వద్దారు?... నేనూ గవర్నమెంటుద్యోగినే, మీరూ గవర్నమెంటుద్యోగే..." అంటూ కోపంతో బయటికెళ్లిపోయాడు.

రాజారావుగారు దిగ్భ్రమ చెందారు. నోట మాట రాక అయోమయంగా ఉండిపోయారు.

ఆఫీసరు తనని అసభ్యపు మాటలన్నాడని యాదగిరి ఆఫీసంతా గొడవ చేశాడు. యూనియన్ వాళ్లకు కూడా ఫిర్యాదు చేశాడు. ఇలా జరుగుతుందని తను అసలు ఊహించనేలేదు. ఎందుకిలా జరిగింది? తను తిట్టాడా? కొట్టాడా? కేవలం 'ఒరేయ్' అని అన్నందుకు ఇంత రభసా?

ఈ సంఘటన జరిగాక రాజారావుగారు మరింత క్రుంగిపోయారు. భార్యకు మాత్రం ఏమీ చెప్పలేదు. తనలో తనే మథనపడసాగారు. ఆఫీసుకెళ్లడం - ఇంటికి రావడం. ఇదే దిన చర్య. అంతకు ముందు భార్యతో కలిసి అప్పుడప్పుడు సినిమాలకనీ, సాంస్కృతిక కార్యక్రమాలకనీ వెళ్లేవారు. ఇప్పుడు మొత్తం విరమించుకున్నారు.

ఒక రోజు సాయంకాలం సమయం -

రాజారావుగారు ఒంటరిగా గుట్ట మీద కూర్చుని ఉన్నారు. రోడ్డు మీద కలకలం వినిపిస్తే అటువైపు చూశారు. స్కూలు విద్యార్థులు ఒకర్నొకరు తిట్టుకొంటూ 'ఒరేయ్!, ఒరేయ్!' అనుకుంటూ ఒకళ్ల భుజాల మీద ఒకళ్లు చేతులేసుకుని ఏవేవో మాట్లాడుకుంటున్నారు.

ఈ విద్యార్థి జీవితంలో స్నేహం ఎంత గొప్పది! ఆ దశ దాటితే మరల ఆ అనుభవం దుర్లభం అవుతుంది. కొంత మంది ఎంతో మారిపోతారు కూడా. దానికి తానే ఒక ఉదాహరణ. కొన్ని సంవత్సరాల క్రితం జరిగిన సంఘటన -

అవి రాజారావు కొత్తగా ఉద్యోగంలో చేరిన రోజులు. చదువయిన తర్వాత నిరుద్యోగం అనుభవించి అనుభవించి ఒక ఆఫీసులో ఉద్యోగి అయినప్పుడు తను ఎంతో ఎత్తు ఎదిగిపోయినట్టు అయ్యేయెస్ ఆఫీసర్ అయిపోయినంత గొప్పతనం ఫీలయ్యాడు. కొంత గర్వం కూడా వచ్చింది. ఒక రోజున సీట్లో కూర్చుని పని చేసుకుంటున్నాడు.

"ఒరేయ్! రాజా..." అన్న పిలుపు విని తలెత్తి చూశాడు రాజారావు.

ఎదురుగా చలపతి!

ఏమిటన్నట్టు చూశాడు రాజారావు అతనికేసి...

"నేనురా! నీ స్నేహితుణ్ణి చలపతిని. మరిచిపోయావా?" అన్నాడు ఆశ్చర్యంతో.

"ఊc... ఏం కావాలి మీకు?" అన్నాడు గంభీరంగా మొఖంపెట్టి.


చలపతి నిర్ఘాంతపోయాడు. కొన్ని క్షణాల పాటు ఏమీ మాట్లాడలేకపోయాడు. తర్వాత తేరుకుని "ఈ ఊళ్లో కొంచెం పనుండి వచ్చాను... ఉద్యోగం కోసం ప్రయత్నిస్తున్నాను... దాని నిమిత్తం..." అని అంటూండగానే "ఊc... చెప్పండి..." అన్నాడు విసుగ్గా రాజారావు ఫైలు తిరగేస్తూ.

ఇప్పుడు చలపతి ముఖం మరింత చిన్నబోయింది. "అదేమిటి! వీడు వింతగా ప్రవర్తిస్తున్నాడు. ముక్కూ మొహం ఎరగనివాడిలా మాట్లాడుతున్నాడు" అని అనుకున్నాడు మనసులో చలపతి.

"పనేమిటో చెప్పండి" - రాజారావు కాలర్ సవరించుకొని మళ్లీ అన్నాడు సీరియస్‌గా పని చేసుకొంటూనే... ఆ మాటల్లో, చేష్టల్లో దర్పం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది.

చలపతికి నోట మాట రాలేదు. ముఖం నల్లబడిపోయింది. క్షణం కూడా అక్కడ నిలబడకుండా వడివడిగా బయటికెళ్లిపోయాడు. అంతే! మళ్లీ కనపడడంలేదు.

ఒకనాటి స్నేహితుడు, ఒకే స్కూల్లో కలిసి చదువుకున్నవాడు అన్న ఇంగిత జ్ఞానం కూడా లేకుండా హోదా తెచ్చిన దర్పంతో, గర్వంతో అసభ్యంగా ప్రవర్తించాడు అతని పట్ల. మనసంతా పశ్చాత్తాపంతో నిండిపోగా చాలాసేపు అలాగే ఉండిపోయారు రాజారావుగారు. ఇంతలో



**భేదాలు లేవట!**

**రాము:-** గోపీగాడి తండ్రికి కులం, మతం, భాష, ప్రాంతం, దేశం, స్త్రీ, పురుష భేదాలే లేవట. ఆయన దృష్టిలో అందరూ సమానమట. అబద్ధాలు చెప్పినట్టుగా అనిపిస్తోందిరా నాకు.

**రవి:-** వాడు చెప్పింది నిజమే! వాళ్ల నాన్న జేబుదొంగలే!

బి. జయమోహన్ [విజయవాడ]

తళుక్కున ఒక ఆలోచన మెరిసింది బుర్రలో. చలవతి తన డిపార్ట్‌మెంట్‌లోనే పని చేస్తున్నట్లు ఈ మధ్యనే తెలిసింది... అవును... ఒక నిర్ణయానికి వచ్చిన వాడిలా లేచి ఇంటికి నడిచారు.

"ఒరేయ్!" అని పిలిపించుకోవాలన్న కోరిక. ఇప్పుడు మరింతబలపడింది ఆయనలో.

మరునటి రోజు ఉదయం ఆఫీసుకు వెళ్లగానే రాజారావుగారు ఎస్టాబ్లిష్‌మెంట్ సెక్షన్ సూపర్నెంటుని పిలిపించారు.

"చూడండి సుబ్రహ్మణ్యంగారు! శ్రీకాకుళం డివిజన్‌లో చలవతి అని క్లర్క్ ఉన్నాడు. అతన్ని మన ఆఫీసుకి బదిలీ చేయాలి. ఫైలు పుటప్ చేయండి... ఇమ్మీడియెట్... ఈ రోజే ఆర్డర్స్ పంపాలి..." ఆదేశం జారీ చేశారు.

సూపర్నెంట్ శిరసావహించి సెక్షన్‌కి వెళ్లిపోయాడు.

మధ్యాహ్నానికి ఫైలు తయారయి రాజారావుగారి దగ్గరకొచ్చింది. సంతకం అయి, టైప్ అయి సాయంకాలానికల్లా ఆర్డరు వెళ్లిపోయింది.

అప్పటికి రాజారావుగారి మనసు తేలిక పడింది. 'ఒరేయ్! ఒరేయ్!' అని పిలుచుకోటానికీ, మనసు విప్పి మాట్లాడుకోవడానికీ ఇంత కాలానికి 'తనవాడు' తన దగ్గరగా వస్తున్నాడు.

ఆ రోజంతా రాజారావుగారు చాలా ఉల్లాసంగా గడిపారు. ఆ సంగతి భార్యకి కూడా చెబితే ఆమె కూడా ఆయన సంతోషంలో పాలువంచుకుంది.

★ ★ ★

**వారం** రోజులు గడిచాయి.

ఆ రోజు కూడా రాజారావు మామూలుగా ఆఫీసుకెళ్లారు. కుర్చీలో కూర్చొని సిగరెట్టు తాగుతూ ఏదో ఆలోచిస్తున్నారు.

"నమస్కారం సార్!"

ఆ పిలుపు విని ప్రక్కకి చూశారు.

చేతిలో కాగితాల్తో చలవతి!

"అరె నువ్వా!" రాజారావుగారు సంభ్రమాశ్చర్యాలలో మునిగిపోయారు. చలవతీ ఆశ్చర్యపోయాడు. కొన్ని క్షణాలకిగాని తేరుకోలేదు.

"ను...వ్...మి...మి..."

"ఏమిటలా నీళ్లు నముల్తావ్..."

"ఆ... ఆ... అబ్బే! నువ్వు! సారీ... మీ... రు..."


ఆ సంబోధనలోని చివరి మాటకు రాజారావుగారు కొంచెం అచ్చెరువొంది, అంతలోనే తమాయించుకుని - "ఆ... ఏవోయ్! బాగున్నావా?..." అన్నారు.

"నన్ను హఠాత్తుగా ఇక్కడికి బదిలీ చేశారు... ఇదిగోండి నా జాయినింగ్ రిపోర్ట్" అంటూ కాగితం టేబిల్ మీద పెట్టాడు చలవతి...

చలవతి మాటలకి రాజారావుగారు మళ్లీ ఆశ్చర్యపోయి "అదేమిటోయ్! నన్ను అండీ అంటున్నావ్? మనం స్నేహితులం" అన్నారు చిరునవ్వుతో...

"అప్పటి స్నేహం వేరు సార్!... ఇప్పుడు మీరు ఆఫీసరు... నేను కింది ఉద్యోగిని..."

చలవతి చాలా మారిపోయాడు! అప్పటి మనిషిలా లేడు. తను ఆఫీసర్ననని భయపడా?




లేక అప్పటి సంఘటనను ఇంకా మనసులో పెట్టుకున్నాడా? - రాజారావు గారికేమీ అర్థం కాలేదు.


అన్యమనస్కంగా జాయినింగ్ రిపోర్ట్‌ను చేతిలోకి తీసుకుని కుర్చీలో కూర్చుండిపోయారు. చలవతి వెళ్లిపోయాడు. తనవాడు, తన స్నేహితుడు, ఎడారిలో ఒయాసిస్సులా, మండు వేసవిలో చిరుజల్లులా వచ్చాడన్న తన సంతోషాన్ని వాడి మాటలు దిగజార్చాయి.

ఆ రాత్రంతా రాజారావుగారికి నిద్ర పట్టలేదు.

మర్నాడు ఒక ఫైలు విషయంలో మాట్లాడవలసి వచ్చి ఫైలు పట్టుకుని ఆఫీసరు గదికొచ్చాడు చలవతి.

"రా... రా... చలవతీ!" ఆప్యాయంగా అని కుర్చీ చూపించారు రాజారావుగారు.

చలవతి కూర్చున్నాడు. రాజారావుగారు రెండు కాఫీలు తెమ్మని అటెండరుకి పురమాయించారు. ఫైలు విషయం చర్చించేటప్పటికి కాఫీ లొచ్చాయి. చలవతి మొహమాటంగా కప్పు అందుకున్నాడు. మిత్రుణ్ణి నెమ్మదిగా దారిలోకి తేవాలని



ఇంటర్వ్యూ

ఒకామె పత్రి కాఫీసుకు వచ్చి - "ఎడిటర్‌గార్ని కలవాలి" అని అడిగింది.

"ఆయన చాలా బిజీగా ఉన్నారు" అని కొంటెగా చూస్తూ - "మీలాంటి అందమైన ఆడవాళ్లకు ఎంత బిజీగా ఉన్నా ఇంటర్వ్యూ ఇస్తారు" చెప్పాడు పి.ఎ.

"అయితే, వా ళ్లావిడ వచ్చిందని చెప్పండి."

సాయి [కానూరు]

రాజారావుగారి ఆలోచన.

"చలవతీ! ఫామిలీని ఎక్కడ పెట్టావ్?"

"వనస్థలిపురంలో సార్... అద్దె కొంచెం తక్కువని..." నాన్నాడు చలవతి...

"ఎందుకూ? మా ఏరియాలో చీప్‌గా ఇప్పిస్తాను. దగ్గరగా కూడా ఉంటుంది" అన్నారు రాజారావుగారు కలుపుగోలుగా.

"థాంక్యూ! వద్దు సార్... ఎలాగూ బస్సులున్నాయి." బెరుకుగా అన్నాడు.

"సరే... నీ ఇష్టం."

ఇద్దరి మధ్యా కొన్ని క్షణాలు మౌనం ఆవహించింది.

"వస్తా సార్!" అంటూ లేచాడు చలవతి.

"అన్నట్లు సాయంకాలం మా ఇంటికి వెళ్దాం... అయిదు గంటలకి, నా దగ్గరికి రా" అన్నారు రాజారావుగారు.

"అలాగే సార్..."

రాజారావుగారు ఫైళ్లలో మునిగిపోయారు.

సరిగ్గా అయిదూ వదికి వచ్చాడు చలవతి రాజారావుగారి రూముకి. ఇద్దరూ ఆటోలో ఇంటికి చేరుకున్నారు.

రుక్మిణమ్మ వరండాలోంచి బయటికొచ్చింది.

"నా స్నేహితుడని చెప్పానే. చలవతి. ఇతనే... నా అర్ధాంగి రుక్మిణి" అంటూ పరిచయం చేశారు రాజారావుగారు.

"నమస్కారమండి."

"నమస్కారం."

ఇద్దరూ లోపలికి నడిచారు.

"కూర్చో..."


సోఫాలో కూర్చున్నాడు చలవతి.

రుక్మిణమ్మ ఫ్రిజ్‌లోంచి రెండు కూల్ డ్రింకులు తీసుకొచ్చింది.

"రుక్మిణీ! భోజనానికి ఏర్పాట్లు చేయి... చలవతీ ఈ రాత్రికి ను వ్వెక్కడే" అన్నారు రాజారావుగారు డ్రింక్ సేవిస్తూ.

"ఏ... ఏ... ఏమిటి, సార్ ఇదంతా?... ఇంటి దగ్గర కూడా చెప్పలేదు" అన్నాడు చలవతి.

"ఏం పర్వాలేదు... ఫ్రెండింటికి



వెళ్లాడనుకుంటారు. అన్నట్లు పిల్ల లెంతమంది చలపతీ? చదువుతున్నారా? మనం కలిసి చాలా ఏళ్లయ్యింది?" ప్రశ్నల వర్షం కురిపించారు రాజారావుగారు.

"ముగ్గురు పిల్లలు... ఇద్దరు అబ్బాయిలు, ఒక అమ్మాయి. పెద్దవాడు పదవ తరగతి చదువుతున్నాడు. రెండోవాడు ఎనిమిదో తరగతి. అమ్మాయి అయిదో క్లాసు."

కొంతసేపు పిచ్చాపాటీ మాట్లాడుకున్నారు. చీకటి పడింది. రుక్మిణమ్మ భోజనాలు వడ్డించింది. ఇద్దరూ భోజనాలు చేస్తున్నారు. రాజారావుగారికి ఏదేదో మాట్లాడేయా లనిపిస్తోంది.

"మనం చదువుకునే రోజుల్లో హెూటల్లో ఎలా తినేవాళ్లం, సినిమాలూ, షికార్లూ, ఆ రోజులే వేరు. కదూ చలపతీ!"...

"అవును సార్! ఆ జీవితమే వేరు!"

"ఏమిటోయ్ సారూ, గీరూ. మనం స్నేహితులం. ఆ రోజుల్లో మనం ఎలా పిలుచుకునేవాళ్లం? ఏరా ఏరా అనుకునేవాళ్లం..."

భోజనాలు ముగిశాయి. సోఫాలో కూర్చున్నారు.

"అవును సార్... స్నేహితులమే. కానీ, మీరు..."

"అదే అనొద్దంటున్నాను. ఆప్యాయంగా ఒరేయ్ అను."

"సారీ సర్... నే నలా పిలవలేను..." భారంగా వచ్చాయి మాటలు చలపతి నోటి నుంచి.

చాలా సేపటిదాకా రాజారావుగారు ఏమీ మాట్లాడలేకపోయారు. పొద్దు పోయాక ఇద్దరూ పక్క పక్క మంచాల పైన పడుకున్నారు.

"చలపతీ! నా చిన్నప్పుడే తల్లిదండ్రులు పోయారు... ఉన్న ఆస్తితో ఏకాకిగా ఉన్న నన్ను మా మేనమామ పెంచాడు. నా చదువు, పెళ్లి అయిన కొంత కాలానికి ఆయనా తనువు చాలించాడు. పెళ్లయి ఇరవై సంవత్సరాలు దాటినా నాకు పిల్లలు లేరు. దౌర్భాగ్యం కొద్దీ నగర వాతావరణంలో పడ్డాక బ్రతుకు మరీ ఎండుటాకులా, జీవితం యాంత్రికంగా మారిపోయింది. ఈ మహా నగరంలో ఒకరికొకరికి సంబంధం ఉండదు. మనస్ఫూర్తిగా మాట్లాడుకోరు. మదిలో ద్వేషం, పెదవులపై దరహాసం..." ఎంతో ఆవేదనగా అన్నారు రాజారావుగారు.

చలపతి అంతా విని నిట్టూర్చాడు. తెల్లవారింది.

రాజారావుగారు, చలపతీ టిఫిను, కాఫీలు సేవించారు.

"చలపతీ! నువ్వు ఆఫీసుకు వెళ్లిపో... నేను కొంచెం ఆలస్యంగా వస్తాను" అన్నారు.

చలపతి అలాగే అని ఆఫీసుకి వెళ్లిపోయాడు.

రాజారావుగారు మళ్లీ మంచం మీద పడుకున్నారు ఆలోచిస్తూ... తలపోటు మొదలైంది. కొంతసేపటికి అది ఇంకా ఎక్కువైంది. భార్య మాత్ర వేసింది. పడుకున్నారు కాని, నిద్రపట్టలేదు. ఒకటే ఆలోచనలు... అప్పటికి మధ్యాహ్నామైంది.

"అబ్బా!" ఉన్నట్టుండి పెద్దగా మూలిగారు రాజారావుగారు.

రుక్మిణమ్మ పరుగున వచ్చింది.

"రుక్మిణీ! గుండెల్లో నొప్పి, డాక్టరు... కాదు... కాదు... ఆఫీసులో చలపతిని అర్జెంటుగా రమ్మని ఫోన్ చెయ్యి."

నొప్పికి మాత్ర ఇచ్చి ఆఫీసుకి ఫోన్ చేసింది ఆవిడ కంగారుగా..."

"ఒరేయ్! అనిపిలిపించుకోవడానికి . ఇంత కాలానికి తన కొక మిత్రుడు దొరికాడు కదా అని సంతోషపడితే - తను మాత్రం అలా పిలిపించుకోవడానికి అర్హుడు కాదట!... తను ఎంత దురదృష్టవంతుడు... అసలు పూర్తిగా తప్పంతా తనదే.... పని మీద వాడు ఒరేయ్ అంటూ దగ్గరికొచ్చినప్పుడు తను అసహ్యంగా ప్రవర్తించాడు. వాడికి క్షమాపణ చెప్పుకోవాలి. అసలు ముందుగానే ఆ పని చేసుండాల్సింది" గొణుక్కుంటున్నారు.

భర్త పరిస్థితికి రుక్మిణమ్మకు ఆందోళన ఎక్కువైంది.

ఇంతలో చలపతి వచ్చాడు, డాక్టర్‌తో సహా...

డాక్టర్ రాజారావుగారిని పరీక్ష చేసి ఏవో మాత్రలు ఇచ్చాడు.

"చలపతీ!... నన్ను క్షమించరా! చాలా కాలం క్రితం మొదట ఏదో పని మీద నువ్వు నా దగ్గరకొచ్చినప్పుడు స్నేహితుడివన్న మాట విస్మరించి నీ పట్ల కనీస మర్యాద కూడా చూపకుండా గర్వంగా మాట్లాడాను. ఈ మానవ జీవితంలో... అబ్బా!... స్నేహం, ప్రేమ అంత గొప్పవి లేవు... ఒక్కసారి మనసారా నన్ను ఒరేయ్ అని పిలవరా..." రాజారావుగారి గొంతు బొంగురుపోయింది...

"సారీ సర్!..." - చలపతికి నోరు రాలేదు.

"పిలవరా" - ఆయాసం ఎక్కువైంది ఆయనకి...

"సార్... అలా పిలవలేను... మీరు ఆఫీసరు... నేను..."

గుండె నొప్పితో పాటు రాజారావుగారికి కోపం కూడా తారస్థాయినందుకొంది - "రేయ్! వెధవ కొడకా..."

"ఒరేయ్! ఏంట్రా కూశావ్?"... చలపతి గొంతు దద్దరిల్లింది.

ఆ పిలుపు కోసమే రాజారావుగారు పరితపించింది.


ఆ పిలుపే ఆయన వినాలనుకొన్నదీ, విన్నదీ.

"చాలురా... ఆ పిలుపు చాలు... న న్నెప్పుడూ అలాగే పిలువు... ఈ గుండె నొప్పి ఇదంతా బూటకం... నీ చేత అలా పిలిపించుకోవాలని ఆడిన నాటకం." రాజారావుగారి కళ్ల నుండి ఆనంద బాష్పాలు రాలాయి.

ఆయన మాటలు విన్న చలపతి కళ్లు చెమ్మగిల్లాయి. కొంతసేపటి వరకు నోట మాట రాలేదు. ఆ తర్వాత అన్నాడు నెమ్మదిగా - "మిమ్మల్ని... కాదు... కాదు... నిన్ను 'ఒరేయ్' అనే పిలుస్తాను... ఇక నుంచి మన పేర్లు - 'ఒరేయ్', 'ఒరేయ్'."

రుక్మిణమ్మ, డాక్టరు వారిద్దర్నీ వింతగా చూస్తుండిపోయారు.

★




**ఒక** పెద్దమనిషి పక్కనున్న పెద్ద మనిషి నడిగాడు. "అత నెవరండీ? ఆ కాలనీలో ప్రతి ఇంటికీ వెళ్లి పత్రికలో ఏదో చూపిస్తున్నాడు" అని.

"అదా! అందులో అతను రాసిన జోక్ పడిందటండి. అదీ సంగతి" అన్నా డా పెద్దమనిషి.

చెళ్లపిళ్ల వెంకటశాస్త్రి [పాండిచ్చేరి]